## కథ

# కులకస్పి

కాలువ మల్లయ్య

98493 77578



తలకు ఇంతెత్తు రుమాలు. మీదికి మలిచికట్టిన కుప్పన పంచు ధోతీ.. రుమాట్లో మొక్కి చుట్ట.. భుజంమీద గొంగడి తప్ప అంగీ లేక సాగబారిన శరీరం.. కుడిచేతికి బోలు కడియం.. నడుముకు తోలు సంచి.. అందులో చెకుముకి రాయి, దూది.. బుర్రమీసాలు.. బైరి గడ్డం.. చేతిలో కట్టె! వాకిట్ల నిల్సున్నడు ఓ నడి వయసాయన. అరుగుమీద నులుక మంచంల కూసున్న గంగయ్య నుద్దేశించి..

''శనార్తులు బావా!'' అన్నడు.

గంగయ్య నొసలు ముడేసి..

''శనార్తులే కని నువ్వెవ్వలు? ఎప్పుడు చూసినట్టు లేదు..'' అన్నడు.

ఇంతల్నే సాయమాన్లకెల్లి లచ్చవ్వ అచ్చింది.

''అక్కా దండాలు. నీ తమ్ముణ్ని..'' అన్నాడాయన.

''నాకు అన్నలు తమ్ముల్లు లేరు. మా అవ్వకు ముగ్గురు బిడ్డలే!'' అన్నది లచ్చవ్వ.

''మీకు నేను తెలువకపోవచ్చుకని నాకు మీరిద్దరెరుకే. పార్వతీ పరమేశ్వరులసోంటోల్లు మా అక్కాబావలు. అగో నా అల్లుడు గూడత్తండు గద.. అల్లుని పేరేంది?''.

''నా కొడుకు గాలయ్య. గిప్పుడు నాలగో తరగతి సదువుతండు! వరుసలు బాగానే కలుపుతున్నవు గని నువ్వెవ్వలో చెప్పకపోతివి!''.

''బావా! నాపేరు గట్టయ్య. నాది నుచ్చులాపూర్. నాకు నా అనెటోల్లు ఎవ్వలు లేరు. మన కులపోళ్లు బాగున్న ఊరు గిది. ఇక్కడ బతుకుదామనచ్చిన. నువ్వు పెద్దగొల్లవైతివి. ఎవ్వలనడిగినా నీపేరే సెప్పిండ్రు!''.

''గంతదూరం నుంచి వచ్చినవా!? సరెగని.. బువ్వది న్నవా లేదా? ఈడ్సుకపొయిన మొకం జూత్తె తిన్నట్టనిపిస్త లేదు! లచ్చమ్మా.. ముందుగాల మీ తమ్మునికన్నం బెట్టు. కడుపు సల్లవడ్డంక మాట్లాడుకుందాం!''.

గా మాటతోని లేచి.. లచ్చమ్మ ఎనుకనే సాయమాన్లకు పేయిండు గట్టయ్య.

కంచు తలెల రెండు గడుకబోట్లు.. గింతంత పప్పేసి, పచ్చిపులుసు పోసింది లచ్చమ్మ. బగ్గ ఆకలున్నట్టుంది.. వాటిని కలుపుకొని దవ్వదవ్వ బుక్కలు పెట్టుకున్నడు.

''అక్కా! మనం గొల్లోళ్లం. కృష్ణుడు మన కులదైవం. మీకు గొర్రెమ్యాకలు లేనట్టున్నయి. గదేం మంచిగనిపిస్త లేదు..'' అన్నడు గట్టయ్య.

* * *

''గట్టయ్యా! ఇగజెప్పు. మీ అక్కతోనేమో అన్నవట. అసలు నువ్వు ఇక్కడికి ఎందుకచ్చినవు? నాతోని నీకేం పనో జెప్పు!?'' అన్నడు గంగయ్య.. పక్కన కూసున్న గట్టయ్య భుజం మీద చెయ్యేసి.

''బావా! నాకు సదువురాదుగని గీ మాటెక్కన్నో విన్న. 'విలువిద్యలెన్ని నేర్చిన కులవిద్యకు సాటిరావు గువ్వలచెన్నా' అని. నీకు ఎవుసమూంది. పెద్ద గొల్లతన ముంది. కుల పంచాయితులు తెంపుతవు. మందెచ్చు లోళ్లు, ఒగ్గోళ్లు, గంగిరెద్దులోళ్లు, కొమ్మోళ్లు.. అందరూ మీ ఇంటిముంగటనే ఆటలాడ్తరు. కతలు జెప్పుతరు. బొమ్మలు నిలవెడ్తరు. నువ్వే త్యాగాలు దెంపుతవు. ఊళ్లె గొల్లలిండ్లల్ల పట్నాలేసుకుంటే నువ్వే ముందట గూసుం టవు. కుడుక, కర్పూరం నీకే పంపుతరు. మందమీద పస్కపిల్లను కోసుకుంటే సప్పమాంసం నీకే పంపుతరు. కానీ, నీకు 'కులకస్పి' లేదు. కులపెద్దకే కులకస్పి లేకుం టెట్ల బావ?''..

గా మాటలిని బొలబొలా నవ్విండు గంగయ్య.

'కులకస్పి' అనే మాట గాలయ్యకెంతో సంబురమనిపిచ్చింది. ఆహ్లాదకరంగా అనిపించింది. ఈ మాటను ఎన్నోసార్లు విన్నడు.

''గట్టయ్యా! నా తమ్ములిద్దరు గొర్ల కాసుకుంటనే బతుకుతండ్రు. మా కుటుంబానికి కులకస్పి ఉన్నట్టేకద! మళ్ల నన్నుగూడ గొర్లుగాయమంటవా ఏంది? ''.

''మీ తమ్ముళ్లకుంటె మీకున్నట్టు ఎట్లయితది బావా? పెద్దమనిషివి అయినంత మాత్రాన కులకస్పి ఉండద్దం టవా? మనకు గొర్లు మ్యాకలుంటె అదో గౌరవం. గొర్లు మ్యాకలున్న ఇండ్లు జూడు.. పాలు, పెరుగు, కవ్వం, ఉట్లు, పాలు కాగవెట్టే ధాతి, ఇండ్లల్ల చిన్న గొర్రెబొక్కల 'మేమే' అని ఒర్రుల్లు.. ఎంతమంచి గుంటది''.

''గా మాట నిజమేనే నాయిన్న. నాగ్గూడ గొర్రెబొక్కు లంటె మస్తిష్టం. మనగ్గూడ గొర్లుంటె మంచిగుంటదే!''..

గాలయ్య మాటలను లచ్చమ్మకూడ సమర్థించింది.

''ఓర్నీయవ్వ! గంటకింద తమ్మున్నని అచ్చిన గట్టయ్య.. అక్క, అల్లుడు అందరు ఒక్కటైనట్టున్నరు గద! నేనేమో గాలయ్యను సదివించుకుంట తెలివికి తేవ న్నంటె.. మీరేమో గొర్లనవడ్తిరి. పొల్లగాన్ని సదువు బందుజేసి గొర్లకు పెట్టన్నా ఏంది?'' అన్నడు గంగయ్య.

''కులకస్పిని ఉంచుకున్నంత మాత్రాన అల్లున్ని సదివి య్యద్దని ఎవ్వలన్నరు? సదువు సదువే. నువ్వు, నీ కొడుకు గొర్లగాయవల్సిన పన్లేదు. కానీ, మీకు గొర్లుం డాలె! ఆ గొర్లను నేనుగాత్త!''.

''గట్టన్న సెప్పేది నిజమే. మనకు గొర్లుండాలె!''.

''నాయిన్నా! గొర్లు కొనే.. నేను మంచిగ సదువు కుంట. మామతోని గొర్లకాడికి గూడ పోత!''.

''అటెవుసం, ఇటు గొర్లు.. మనకు ఊళ్లె గౌరవం ఇంకా పెరుగుతది''.

''అందరికి గొర్లమీదికి మనుసు పోయిందేంది?''.

''కులపోళ్లింటికి పండుగ, పబ్బాలకు పెయినప్పుడు అందరడుగుతండ్రు.. 'పెద్దగొల్ల గదా.. మీ ఆయినెకు గొర్లెందుకు లెవ్వు?' అని. గట్టన్న దేవునోలచ్చిండు. గొర్లు కొనుడే!'' అన్నది లచ్చవ్వ.

''బావా! నాతోని నువ్వురా చుట్టుపక్కల ఊర్లల్ల మందమందకు తిరిగి మంచి సనుగులను ఏరుకత్త. గొర్ల మర్మం నాకెరికే. నాకెవ్వలు దిక్కులేరు. మీ ఇంట్లనే ఉంట. గొర్లగాత్త. బట్టపొట్టకు పోంగ ఏమిత్తవో ఇయ్యి. అవ్విగూడ నీ దగ్గర్నే ఉంచుకో.. నేను సచ్చె దాక నీతోనే ఉంట!''.

''అన్నా! ఎవ్వల కులకస్పి ఆల్లకుండాలె.. నువ్వే మాలోసించకు..'' అన్నడు గొర్లకాన్నుంచి వచ్చిన తమ్ముడు రాజయ్య.

''గంగునాయిన్నా! గొర్ల కొను. బోయుడుగూడ దొరికె. ఒక్కగొర్రె గూడలేని నువ్వేం పెద్దగొల్లవురా?''.. అక్కడికి వచ్చుకుంటనే అన్నడు మొండె రాజయ్య.

''నా పెద్దకొడుకువు నువ్వేగాదుర రాజన్న. నువ్వు గూడ మీ అవ్వ, తమ్ముడన్న మాటే అనవడ్తవి. నన్ను పెద్దమనిషితనం ఇడిసిపెట్టి గొల్లబోయున్ని సెయ్యన్నని అనుకుంటున్నర? మరి నా కొడుకును గా పనిసెయ్య మనా మీ మాటలు...? మంచోల్లే ఉన్నరు!''.

''గంగునాయిన్నా! మనిద్దరం ఒక్క వయిసోల్లమేనై తిమి? ఊళ్లె పెద్దమనిషితనం నువ్వే సేత్తున్నవుగని.. నేం జేత్తలేనా? నాకు గొర్లు లెవ్వా! నా కొడుకును సదివిస్తలేనా? నీ కొడుకు సదువుకు, నీ పెద్దమనిషిత నానికి గొర్లేం అడ్డమత్తయని? కుల కస్పి లేనోనికి పెద్దగొల్లతనం ఎందు కురా!?ఇంకేమాలోసించకు!''.

మొండె రాజన్న మాటలిని తల కాయూపిండు గంగయ్య.

* * *

అంబటాల్లయింది. ఊరి జనం బువ్వదిని చేనుపనికి పోవుటానికి తయారైతండ్రు. ఎడ్లను తోలుకొని మక్కపెరం డ్లల్ల కలుపుమొక్కలు దున్నటానికి